ఈనాడు
జోగులాంబ గద్వాల
గురువారం సెప్టెంబరు 26, 2024 5

రెండు నెలలకోసారి ప్రాజెక్టులపై సమీక్ష

పాలమూరు సాగునీటి పథకాలకు ప్రాధాన్యం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



గట్టు ఎత్తిపోతల పథకం వద్ద మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రి జూపల్లి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ సంతోష్ తదితరులు

ఈనాడు, మహబూబ్‌నగర్-న్యూస్‌టుడే, నాగర్‌కర్నూల్: పాలమూరు ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నామని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎత్తిపోతల పథకాల పరిధిలో ఎక్కడెక్కడ నిధులు మంజూరు చేయాలో నివేదికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రెండు నెలలకోసారి పాలమూరు ప్రాజెక్టులపై సమీక్షలు చేపడతామన్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాజెక్టులను బుధవారం ఆయన మంత్రి జూపల్లి, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సందర్శించారు. ఉత్తమ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో ఇక్కడి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ భూసేకరణ సమస్యలతో పనులు ఆలస్యం అవుతున్నాయని గుర్తించామన్నారు. దీనిపై గురువారం లోగా సమగ్ర సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఉదండాపూర్‌లో భూ సేకరణ, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రావాల్సిన నిధులు ఆరు నెలల్లో చెల్లిస్తామన్నారు. గద్వాల నియోజకవర్గంలో 20 టీఎంసీల నీరు నిల్వ చేసేలా జలాశయాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. నార్లాపూర్ వద్ద పెండింగ్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. జలాశయాల సందర్శన వద్ద అక్కడి సమస్యల్ని ప్రస్తావిస్తూ పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ పథకాల ఉద్దేశం, వాటి పూర్తి వివరాలపై ప్రాజెక్టు అధికారులను ప్రశ్నించగా కొన్ని చోట్ల అధికారులు తడబాటుకు గురయ్యారు. స్థానిక ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని ఈ పథకాలను వివరించారు.

వన్‌టైం సెటిల్‌మెంట్ చేయాలంటూ ఆందోళన..: ఉదండాపూర్ జలాశయం పర్యటన ముగించుకుని వెళ్తుండగా ముంపు గ్రామాలకు చెందిన కొందరు అడ్డుకునే ప్రయత్నం చేశారు. తమకు వన్‌టైం సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే రూ.25 లక్షలు ఇస్తామని చెప్పి.. రాత్రికి రాత్రి రూ.16 లక్షలే ఖాతాలో ఎలా జమ చేస్తారని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, తమకు న్యాయం జరగకుంటే జలాశయం పనులను అడ్డుకుంటామని తెలిపారు. ఓ దశలో తోపులాట జరిగింది. పోలీసులు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ మల్లు రవి, దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, స్పెషల్ చీఫ్‌సెక్రటరీ రామకృష్ణరావు, ఈఎన్‌సీ అనిల్, కలెక్టర్లు సంతోష్, విజయేందిర బోయి, నీటి పారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు వివరించిన ఎమ్మెల్యేలు..: సమీక్షలో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ నార్లాపూర్, ఏదుల మధ్యలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలోని జలాశయాల వద్ద ఒక్కో పంపునైనా సిద్ధం చేసి నీరు ఎత్తిపోసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

● ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గాల్లో తక్కువ వర్షపాతం నమోదవుతుందన్నారు. ఉదండాపూర్.. ప్రాజెక్టుకు గుండెకాయలాంటిదన్నారు. ● మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో 8 గ్రామాల ప్రజలకు నీటి ఊటతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ గ్రామాల ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ కింద పరిహారం ఇప్పించాలన్నారు.

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కేఎల్ఐ కాలువ 10 చోట్ల తెగిపోయి పంట పొలాలు దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. ● ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట ఎత్తిపోతల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో శంకుస్థాపన చేయించాలన్నారు. కేఎల్ఐ 29 ప్యాకేజీలో వంగూరు మండలంలోని 8 గ్రామాలకు నీళ్లు ఇవ్వాలని కోరారు.

● నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ వట్టెం జలాశయం కింద డిస్ట్రిబ్యూటరీ కాలువలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయకట్టును పెంచాలని కోరారు. ● అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ నెట్టెంపాడు కింద 99వ ప్యాకేజీలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు.

● దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడి మాట్లాడుతూ హాజీలాపూర్, చౌదరపల్లి ఎత్తిపోతల పనులను చేపట్టాలని కోరారు.

20 శాతం కూడా చేయలేదు: జూపల్లి

సమీక్షలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ భారాసకు చెందిన మాజీ మంత్రి ఒకరు వారి హయాంలో 90 శాతం పనులు పూర్తి చేసినట్లుగా చెబుతున్నారని, ఇది పూర్తిగా అవాస్తవమన్నారు. పాలమూరు జిల్లాలో కుర్చీ వేసుకుని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని కేసీఆర్ చెప్పారన్నారు. ఇప్పటికీ 20 శాతం పనులు కూడా పూర్తి చేయలేదన్నారు. కాలువలు పూర్తి కాకుండా ఆయకట్టుకు నీరెలా ఇస్తారని ప్రశ్నించారు. నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదన్నారు. సక్రమంగా పని చేయకపోవడం వల్లే ఉమ్మడి జిల్లాలో 14 ఎమ్మెల్యే స్థానాలకు భారాస రెండు సీట్లకే పరిమితమైందన్నారు.



నాగర్‌కర్నూల్: సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మేఘారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి, నారాయణరెడ్డి, వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, విజయుడు, మధుసూదన్‌రెడ్డి

తాగునీరు అందుబాటెంత?

నామమాత్రపు సర్వేలో నిగ్గుతేలని నిజాలు

ప్రతి ఇంటికీ శుద్ధిచేసిన తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేస్తోంది. జిల్లాలోని నాలుగు పురపాలికలు, 255 గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రతి గ్రామానికి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి, నీటి ట్యాంకులను నిర్మించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. నిర్వహణ లోపం కారణంగా మూడో వంతు ప్రజలు వీటి ఫలితాలను అందుకోలేకపోతున్నారు.

-న్యూస్‌టుడే, అయిజ



అయిజ పట్టణంలో నిర్మించిన నీటి ట్యాంకు

పైప్‌లైన్లు లీకేజీ కావడం, గ్రామాలకు సక్రమంగా నీరందకపోవడం, అధిక ఒత్తిడికి గురై పైపులు పగిలిపోవడం తదితర కారణాలతో క్షేత్రస్థాయిలో పథకాన్ని పరిశీలిస్తే చాలా మందికి మంచినీరు సక్రమంగా అందడంలేదని తేలుతోంది. పైప్‌లైన్ లీకేజీలతో మురుగు, కలుషితనీరు పైప్‌ల్లోకి చేరుకుని నీరు కలుషితవుతోంది. కలుషిత నీటిని తాగి పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు. గద్వాల, అయిజ, వడ్డేపల్లి, అలంపూర్ పట్టణాల్లో చాలాసార్లు రంగుమారిన నీరు సరఫరా అయింది. ట్యాంకులను నెలలో మూడుసార్లు బ్లీచింగ్ పౌడర్‌ను ట్యాంకులో వేసి శుభ్రం చేయాల్సి ఉండగా కనీసం నెలలో ఒకసారి కూడా చేయడంలేదు. కలుషితనీరు వస్తుండటంతో జిల్లాలో చాలావరకు భగీరథ నీటిని తాగడంలేదు. ప్రతి ఇంటికీ పైప్‌లైన్ వేయడంతో పాటు నల్లాలు బిగించాలి. చాలా వరకు బిగించలేదు. దీంతో రూ.కోట్లు వెచ్చించినా లక్ష్యం మాత్రం నెరవేరడంలేదు.

నామమాత్రంగా సర్వే: పుర సిబ్బంది పట్టణాల్లో, పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో మిషన్ భగీరథ పథకంపై సర్వే నిర్వహించారు. ప్రధానంగా పది అంశాలను పరిగణలోకి తీసుకొని సర్వే అనంతరం యాప్‌లో పొందుపరిచారు. అంతంతమాత్రంగా నిర్వహించిన ఈ సర్వేను ఉన్నతాధికారులకు నివేదించినా ఇప్పటిదాకా చర్యలేవీ లేవు.

ఇవిగో దృష్టాంతాలు

● మల్దకల్ మండలం సద్దలోనిపల్లి, మద్దెలబండ గ్రామాల్లో లీకేజీల కారణంగా ఇబ్బందిగా ఉంది. ట్యాంకులను శుభ్రం చేయడంలేదు.

● అయిజ పట్టణంలోని కర్నూలు రహదారి సమీపంలో నిర్మించిన ట్యాంకు నుంచి పట్టణానికి సరఫరా చేస్తున్నారు. నెలకోసారి కూడా దాన్ని శుభ్రం చేయడంలేదు. పైప్‌పైన్ లీకేజీల కారణంగా కింది కాలనీలకు నీరు సక్రమంగా అందడంలేదు. ● అయిజ మండలం పులికల్‌లో ట్యాంకును రెండు నెలలైనా శుభ్రం చేయడంలేదు. లీకేజీలు ఎక్కువగా ఉండటంతో నీటి సరఫరా నామమాత్రంగా సాగుతోంది. వచ్చిన వారికి కలుషిత నీరు, రానివారికి అదికూడా లేదు. దీనిపై గ్రామస్థులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ● వడ్డేపల్లి పురపాలిక పరిధిలో పైప్‌లైన్ లీకేజీ కారణంగా ఇబ్బందులు తలెత్తాయి. సుమారు 15 రోజుల పాటు నీటికోసం అవస్థలు పడ్డారు. ప్రస్తుతం రామచంద్రానగర్, పాత శాంతినగర్ కాలనీల్లో కొంతమేర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో నీటి ట్యాంకుల శుభ్రత ప్రశ్నార్థకంగా మారింది.

● గద్వాల పట్టణంలో నీటిట్యాంకుల పరిశుభ్రత అంతంతమాత్రంగానే ఉంది. పట్టణంలోని కాలనీలకు పూర్తిస్థాయిలో నీరందడం లేదు. రెండో రైల్వేగేటు, కొత్త హౌసింగ్‌బోర్డు, సంతోష్‌నగర్, 2, 3, 6 వార్డుల్లో భగీరథ నీరందడంలేదు. రైల్వేలైన్ అడ్డుగా ఉండటంతో అక్కడ పైప్‌లైన్ లేదు. దీంతో భగీరథ నీరు కాలనీలకు సరఫరా కావడంలేదు.

కార్మికుల కొరతతో..: నీటి ట్యాంకులను తరచూ శుభ్రం చేయిస్తున్నాం. కార్మికుల కొరత కారణంగా అప్పుడప్పుడూ కొంత జాప్యం ఏర్పడుతోంది. నిబంధనల ప్రకారం క్లోరినేషన్ చేయించే విధంగా కృషిచేస్తాం.

-లక్ష్మారెడ్డి, అయిజ పుర కమిషనర్

తీరంలో భూమాయ



కృష్ణ మండలం ముడుమాల్‌దొడ్డి శివారులో సర్వే నెం.45లో ప్రభుత్వ భూమి

కృష్ణా, మాగనూరు మండలాల్లో గతంలో విడతలవారీగా బడుగువర్గాలకు 2140 ఎకరాల భూమి ఎసైన్‌మెంట్ కమిటీ ద్వారా కేటాయించారు. పట్టాలిచ్చారు. కొందరికి పాసు పుస్తకాలున్నాయి. కానీ భూమి ఎక్కడుందో హద్దులేమిటో ఇప్పటికీ తెలియదు. చేతులు మారిందేమోనన్న అనుమానం రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

న్యూస్‌టుడే, కృష్ణా

గతంలో నిరుపేద రైతులకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా మంజూరుచేసిన భూములు అధికారుల సంతకాలకే పరిమితమయ్యాయి. ఒక్కొక్క రైతుకు అప్పట్లో మూడు నుంచి ఐదెకరాల భూమి కేటాయించి పట్టాలు ఇచ్చారు. చాలామంది రైతులకు ఇప్పటి వరకూ తమ పేరిట ఉన్న భూమి ఎక్కడన్నది చూపించలేదు. గతంలో పట్టాలు తీసుకున్న వారిలో కొందరు కాస్తులో ఉన్నారు. ధరణి వచ్చాక వారి పేరిట ఉన్న పట్టాలు నిలిపి వేశారు. వారికి అందాల్సిన రైతు బంధు నిలిపివేశారు. వారంతా ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మాగనూరు, నేరేడ్‌గం, ఆలంపల్లి, అడవిఖానాపూర్, ముడుమాల్, వడ్వాట్, అయినాపూర్ గ్రామాలలో అసైన్‌మెంట్ ద్వారా ఇచ్చిన భూముల వివరాలు మొత్తం గందరగోళంగా ఉన్నాయి. సరిదిద్దాల్సిన అధికారులు సర్వేయర్లపైకి నెపంనెట్టి జారుకుంటున్నారు. వందల ఎకరాల అసైన్‌మెంట్ భూమి ప్రశ్నార్థకంగా మారింది. ఆలంపల్లి శివారులోని 302 ,305, 306 సర్వే నంబర్లలో అప్పటి రైతుల పేర్లు ఇప్పుడు లేవు. వాటిపై విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఏళ్లకు ఏళ్లుగా సమస్య : 1972 నుంచి 2006 వరకు అసైన్‌మెంట్ భూ పంపిణీ జరిగింది. నేటి వరకూ కొందరు మాత్రమే లబ్ధి పొందారు. చాలా మంది పేర్లు అసైన్‌మెంట్ కమిటీలో ఉన్నా ఇప్పుడు వారి పేర్లపై భూములు లేవు. ఒకటీ అరా తప్ప మిగతావి అన్యాక్రాంతమైపోయాయి. కృష్ణా తీరంలో బడుగువర్గాలకు ఇచ్చిన భూములు చాలావరకు వేరే వర్గాల పేరుపై రిజిస్ట్రేషన్ కావడంలో మతలబు ఏమిటో అర్థం కావడం లేదు.

అర్జీ ఇస్తే పక్కకే : అసైన్‌మెంట్ భూముల విషయంలో వస్తున్న అర్జీలను సర్వే పేరుతో పక్కకు పెడుతున్నారు. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత మొత్తం అసైన్డ్ భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి వివరాలు బయటకు వెల్లడించడం లేదు. పలు గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదులు చాలా వరకు బుట్ట దాఖలయ్యాయి. 'ప్రజావాణి'లో కలెక్టరుకు దరఖాస్తు చేసుకున్నా అదే పరిస్థితి ఉంది.

ఆదేశాల మేరకు నిషేధిత జాబితాలోకి...: గతంలో ప్రభుత్వ ఆదేశాల మేరకే నిషేధిత భూముల జాబితాలో చేర్చాం. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా సంక్రమించిన భూములకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తాం. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయితే తదుపరి చర్యలు చేపడతాం.

- సురేశ్, తహసీల్దారు, మాగనూరు.



మా నాన్నకు ప్రభుత్వ భూమి ఐదెకరాలు సంక్రమించింది. ఇద్దరు అన్నదమ్ములం సమానంగా పంచుకుని సాగు చేసుకుంటున్నాం. భారాస హయాంలో పట్టాలు రద్దు చేశారు. నేటికీ అదే పొలంలో పంటలు వేసుకుంటున్నాం. మాకు అన్యాయం చేయవద్దు. - సాధు నర్సప్ప, గురురావు లింగంపల్లి



మూడు దశాబ్దాల క్రితం గుడేబల్లూర్ శివారులో భూమికి పట్టా పాసుపుస్తకం ఇచ్చారు. బ్యాంకులో రుణం తీసుకున్నాను. రైతుబంధు వచ్చింది. మా భూమి ఎక్కడుందో అడిగితే మాత్రం చెప్పడం లేదు. - వంద్రపోళ్ల శివప్ప, గుడేబల్లూర్



నా భార్య ఉమాదేవి పేరిట అయినాపూర్ శివారులో మూడెకరాలు పట్టా ఇచ్చారు. నాటి నుంచి నేటి వరకూ మాకు ఇచ్చిన భూమి ఎక్కడ ఉందని అడిగితే అధికారులు సమాధానం చెప్పడం లేదు. పేరుకే పట్టాలు ఇచ్చి రికార్డులలో పేర్లు తారుమారు చేశారేమో అనుమానం కలుగుతోంది. - గుండప్ప సవకార్, గుడెబల్లూర్.

జూరాలకు పెరుగుతున్న వరద



సుంకేసుల నుంచి విడుదలవుతున్న నీరు

ధరూరు, శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వరద పెరుగుతోంది. జలాశయంలోకి బుధవారం సాయంత్రానికి 71 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. 7 గేట్లు, జలవిద్యుదుత్పత్తి ద్వారా 88 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని జూరాలకు వరద మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో దిగువకు నీటి విడుదల పెంచినట్లు అధికారులు తెలిపారు. అటు కర్ణాటక ప్రాజెక్టులకు సైతం వరద స్వల్పంగా పెరిగినట్లు సమాచారం.

తుంగభద్ర: నదిలో బుధవారం 9,850 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 9.1 అడుగుల ఎత్తులో నీటి ప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధాన కాల్వకు 8 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా రాష్ట్రానికి వచ్చేసరికి అది 4.5 అడుగులుగా ఉంది.

సుంకేసుల నుంచి నీటి విడుదల: సుంకేసుల జలాశయానికి ఇన్‌ఫ్లో పెరగడంతో దాదాపు పది రోజుల తరువాత దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి జలాశయానికి 15,800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో మూడు గేట్లను ఒక మీటరు మేర ఎత్తి దిగువకు 13,400 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లుగా డ్యాం జేఈ రాజు తెలిపారు. కేసీ కాలువకు 2,400 క్యూసెక్కులు వదులుతున్నామని ఆయన పేర్కొన్నారు.

గట్టు ఎత్తిపోతలకు శాస్త్రీయ సర్వే ఏదీ: భారాస

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గట్టు ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారం లేకుండా, సర్వే నిర్వహించకుండా 15 టీఎంసీలకు ఎలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తారని భారాస రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్ ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల మండలంలో వందలాది ఎకరాల భూములు ముంపునకు గురయ్యే అవకాశాలున్నాయని, కర్ణాటకకు సాగునీరు అందించడానికి ఈ ప్రాజెక్టును ప్రతిపాదిస్తున్నారని, దీనిని అడ్డుకుంటామన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించకుండా రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు ఏకపక్షంగా ఈ ప్రాజెక్టును నిర్మించడం కోసం ప్రస్తుతం జరుగుతున్న పనులను పరిశీలించడాన్ని తప్పుపట్టారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల నడిగడ్డకు ఏ మాత్రం న్యాయం జరగదని, కర్ణాటకకు న్యాయం చేయడానికి మంత్రి కృష్ణారావు, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కలిసికట్టుగా ఈ ప్రాంత ప్రజలను, రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు.

మత్తు పదార్థాలతో కుటుంబాలు విచ్ఛిన్నం

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: యువత డ్రగ్స్, గంజాయి లాంటి నిషేధిత మత్తు పదార్థాలకు బానిసలై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం వల్ల కుటుంబాలే కాకుండా సమాజం కూడా విచ్ఛిన్నమవుతుందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం గద్వాలలోని సమితి జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గ్రామాల్లో సమితి కార్యకర్తలు, నాయకులు, ఇలాంటి విషయాలపై సమాచారం వస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వాటివల్ల కలిగే నష్టాన్ని వివరించాల్సిన బాధ్యత కూడా మనందరిపైన ఉందన్నారు. జిల్లాలో మహిళలపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు, యువతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, ప్రేమ్‌రాజ్, బలరామ్ నాయుడు, రంగస్వామి, వెంకట్రాములు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ రంజిత్‌కుమార్

విద్యాలయాలకు నిర్వహణ నిధులు

● ఉమ్మడి జిల్లాకు రూ. 9.53 కోట్లు

● తొలి విడత 50 శాతం విడుదల



కొండనాగుల జడ్పీ ఉన్నత పాఠశాలలోని శౌచాలయాలు

అచ్చంపేట, న్యూస్‌టుడే: పాఠశాలలు ప్రారంభమైన మూడు నెలల తర్వాత నిర్వహణ నిధులు మొదటి విడతగా 50 శాతం విడుదల కావడంతో కష్టాలు తీరనున్నాయి. త్వరలో రెండో విడత విడుదల చేయనుండటంతో పాఠశాలల్లో కనీస వసతుల కల్పనకు వెసులుబాటు ఏర్పడింది. కనీస అవసరాలైన సుద్ద ముక్కలు, రిజిస్టర్లు, హాజరు పట్టికలు, స్టేషనరీ, చార్టులు, పరీక్షల నిర్వహణ, కంప్యూటర్ సామగ్రి, శౌచాలయాల నిర్వహణ, తాగునీరు, మరమ్మతు పనులు, ఇంటర్నెట్, ప్రయోగశాలల పరికరాలు, రసాయన సామగ్రి, జాతీయ పండుగల నిర్వహణ, డస్టర్లు, చీపుర్లు, బకెట్లు, బిందెలు, సబ్బులు తదితర వస్తువులను కొనుగోలు చేసేందుకు ఏటా సర్కారు నిధులు కేటాయిస్తోంది. గతంలో ఈ నిధుల నుంచే విద్యుత్తు బిల్లులు కూడా చెల్లించేవారు. ఈ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉచిత విద్యుత్తును అందిస్తుండటంతో కొంత భారం తగ్గింది. నిధుల విడుదలలో జాప్యంతో హెచ్‌ఎంలు సొంత నిధులు పెట్టి అవసరమైన వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో వెసులుబాటు కలగనుంది. పాఠశాలల నిర్వహణ కోసం ఉమ్మడి జిల్లాలోని 3,032 పాఠశాలలకు మొత్తం రూ. 9.53 కోట్లు మంజూరు చేసింది. మొదటి విడతగా అందులో 50 శాతం నిధులు రూ. 4.76 కోట్లు విడుదల చేశారు.

ఉమ్మడి జిల్లాకు నిధులు (రూ.లలో)

జిల్లా	పాఠశాలలు	విడుదల
గద్వాల	447	87,90,000
మహబూబ్‌నగర్	795	1,16,67,500
నాగర్‌కర్నూల్	834	1,13,02,500
నారాయణపేట	460	84,37,500
వనపర్తి	496	74,75,000
మొత్తం	3,032	4,76,72,500

● ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కేజీబీవీ, ఆదర్శ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు కేటాయించారు. ఈ నిధులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఏఏపీసీ) తీర్మానంతో పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది.

- డా.గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూల్

ఆర్డీఎస్ వాటా తేలేదెన్నడు?

శాంతినగర్, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయం నుంచి ఆర్డీఎస్ వాటా కింద రావాల్సిన నీటిపైన ఇప్పటి వరకు డ్యాం బోర్డులో ఎటువంటి చర్చా జరగలేదు. ఏటా ఆగస్టు నెలలో జలాశయంలో ఉండే నీటి నిల్వను అనుసరించి ఏపీ, తెలంగాణ, కర్ణాటకలకు వాటాలు నిర్ణయిస్తారు. ఈ ఏడాది జలాశయం గేటు కొట్టుకుపోయి 40 టీఎంసీల నీరు వృథాగా దిగువకు వెళ్లిపోయింది. ఎగువ ప్రాంతంలో భారీవర్షాలు పడటంతో ఎట్టకేలకు జలాశయంలోకి తిరిగి 100 టీఎంసీల నీరు చేరింది. దీనిలో ఎవరి వాటా ఎంతనేది నిర్ణయించాల్సి ఉంది. తెలంగాణలోని ఆర్డీఎస్ వాటా ఎంతనేది కూడా నిర్ణయం జరగాల్సి ఉంది. మొన్న ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద నీరు 7 అడుగులకు చేరింది. అదే పరిస్థితి కొనసాగి ఉంటే ఈ సమయానికి ఇండెంట్ పెట్టాల్సి వచ్చేది. జలాశయం దిగువన వర్షాలు పడుతుండటంతో ప్రస్తుతం ఆనకట్టలోకి నీరు చేరుకొంటోంది. దీంతో ఇబ్బంది కలగడంలేదు. లేదంటే జలాశయంలోని నీటి కోసం ఈపాటికి ఆర్డీఎస్ వాటా కింద ఇండెంట్ పెట్టాల్సి వచ్చేది. ఎవరికి ఎంత వాటా అనేది నిర్ణయించకుండా ఇండెంట్ పెట్టే పరిస్థితిలేదు. దీనిపైన ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది. లేదంటే రాబోవు రోజుల్లో సాగునీటికి ఇబ్బంది పడాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.



వట్టెం పంపుహౌస్‌లో తేలిన మోటార్లు

నీటి తిరిగి ఎత్తిపోత



వట్టెం పంపుహౌస్ ఇదే..

నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, న్యూస్‌టుడే : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని వట్టెం జలాశయం వద్ద చేపట్టిన పంపుహౌస్‌లో మునిగిన మోటార్లు బుధవారం తేలాయి. ఈనెల 2న వచ్చిన భారీ వర్షాలకు శ్రీపురం, ఉయ్యాలవాడ, కుమ్మెర గ్రామాల వద్ద ఉన్న ఆడిట్ టన్నెళ్ల ద్వారా నీరు లోపలికి వెళ్లాయి. పంపుహౌస్‌లోని మోటార్లు పూర్తిగా మునిగిపోయాయి. 20 మీటర్ల వరకు నీరు నిల్వగా మారింది. శ్రీపురం నుంచి వట్టెం వద్ద ఉన్న పంపు హౌస్ వరకు ఉన్న టన్నెల్ పూర్తిగా నీటిలో ఉంది. మోటార్లు మునిగిన తర్వాత ఈ 4వ తేదీ నుంచి మోటార్ల ద్వారా నీటిని తోడివేసే పనులను చేపట్టారు. ముందుగా మోటార్లను బయటికి తీసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 40 మోటార్ల ద్వారా నిత్యం నీటిని తోడివేస్తున్నారు. వారం రోజులుగా సర్జిపుల్ నుంచి పంపుహౌస్‌లోకి నీళ్లు వెళ్లకుండా షట్టర్ల మూసివేత పనులు చేపట్టారు. ఆరుగురు గజ ఈతగాళ్లను పిలిపించి షట్టర్లలో నుంచి పంపుహౌస్‌లోకి నీళ్లు రాకుండా చర్యలు చేపట్టారు. బుధవారం మోటార్లు తేలాయి. 15 కిలో మీటర్ల పొడవునా ఉన్న టన్నెల్‌లో మాత్రం నీళ్లు అలాగే ఉన్నాయి. పంపుహౌస్‌లో ఉన్న నీటిని ఐదు హెచ్‌పీ మోటార్ల ద్వారా తోడివేశామని, మోటార్లకు మరమ్మతులు చేస్తున్నట్లు ఈఈ పార్థసారథి తెలిపారు.



మోటారు భాగాలు విడదీసి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

9 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయం నుంచి వరద నీటి విడుదల కొనసాగుతున్న నేపథ్యంలో ఎగువ, దిగువ జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి చేపట్టేందుకు జెన్‌కో సిబ్బంది చర్యలు తీసుకున్నారు. గడచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 3.017, దిగువన నాలుగు యూనిట్ల ద్వారా 2.910 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం ఉత్పత్తి ఎగువన 193.074, దిగువన 167.034 మిలియన్ యూనిట్లకు చేరిందని జెన్‌కో ఎస్‌ఈ (ఓఅండ్‌ఎం) సూరిబాబు తెలిపారు.

అమ్మాయిలు తగ్గిపోతున్నారు..!

● నాగర్‌కర్నూల్ జిల్లాలో గత ఏడాది బాలురు 6,639 మంది జననాలు నమోదైతే.. అమ్మాయిలు 5,913 మాత్రమే ఉన్నారు. ఆ జిల్లాలో లింగనిష్పత్తి వెయ్యి మంది అబ్బాయిలకు 891 మంది అమ్మాయిలు మాత్రమే ఉన్నారు. ఇలాగే కొనసాగితే బాలికల శాతం ఇంకా తగ్గే ప్రమాదం ఉంది.

● మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ ఏడాది జనాభా వివరాల ప్రకారం 10,82,264 మంది ఉన్నారు. అందులో అమ్మాయిలు 6,979 మంది ఉంటే అబ్బాయిలు 7,617 మంది ఉన్నారు. వెయ్యి మంది అబ్బాయిలతో పోల్చుకుంటే అమ్మాయిలు 916 మంది మాత్రమే ఉన్నారు.



మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జన్మించిన నవజాత శిశువులు

పాలమూరు, న్యూస్‌టుడే

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మూడేళ్లలో నమోదైన జననాల రేటులో అబ్బాయిల కంటే అమ్మాయిల సంఖ్య తక్కువగా నమోదైంది. వీరిపై చిన్నచూపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పల్లెల్లో, తండాల్లో మగపిల్లలు పుట్టాలని కోరుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఇంటి బాధ్యతలు మోస్తాడని.. తల్లిదండ్రులకు ఆధారంగా ఉంటాడని.. వంశాన్ని నిలబెడతాడని.. కొందరు పాత పోకడలను పట్టుకుని వాటిని పాటిస్తున్నారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఆడపిల్లలపై వివక్ష కొనసాగించడం ఆందోళనను కలిగిస్తోంది. అబ్బాయిలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించి అమ్మాయిలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేవారున్నారు. ఇద్దరూ సమానమని అవగాహన కల్పిస్తున్నా మార్పు రావడం లేదు.

విచ్చలవిడిగా స్కానింగ్ కేంద్రాలు

భ్రూణ హత్యలు చేయడం నేరం. గుట్టుచప్పుడు కాకుండా గర్భవిచ్ఛిత్తి చేస్తున్నారు. మూడు నెలల క్రితం భూత్పూర్ సమీపంలో ఓ ఆర్‌ఎంపీ పర్యవేక్షణలో వివాహితకు గర్భవిచ్ఛిత్తి వైద్యం వికటించి ఆమె మృతి చెందిన విషయం తెలిసిందే. ఇలాంటి నేరాలు అప్పుడప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. వెలుగులోకి రానివి ఉమ్మడి జిల్లాలో చాలా ఉంటాయి. పట్టణాలు, మండల కేంద్రాల్లో స్కానింగ్ కేంద్రాలు విచ్చలవిడిగా ఏర్పాటయ్యాయి. ఇక్కడి వచ్చే గర్భిణుల పేర్లు నమోదు చేసుకొని, ఆధార్‌కార్డు వివరాలు రికార్డుల్లో రాయాలి. పూర్తి సమాచారం వారి వద్ద ఉండాలి. కొందరు స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు పేర్లు చేసుకుంటున్నారు. పుట్టబోయేది ఆడ లేదా మగ వివరాలు కూడా చెబుతున్నారు. ఈ కేంద్రాలపై వైద్య, ఆరోగ్య శాఖాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది.



ఉమ్మడి జిల్లాలో నమోదైన బాలుర, బాలికల జననాల వివరాలు..

(అబ్బాయిలు / అమ్మాయిలు)

జిల్లా	2021-2022 అబ్బాయిలు	2021-2022 అమ్మాయిలు	2022-2023 అబ్బాయిలు	2022-2023 అమ్మాయిలు	2023-2024 అబ్బాయిలు	2023-2024 అమ్మాయిలు
మహబూబ్‌నగర్	8,099	7,577	7,958	7,406	7,617	6,979
నాగర్‌కర్నూల్	6,680	6,062	6,742	6,782	6,639	5,913
వనపర్తి	4,710	4,346	4,606	4,393	4,647	4,030
జోగులాంబ గద్వాల	5,007	4,732	4,984	4,625	4,773	4,268
నారాయణపేట	5,258	4,956	5,234	4,831	5,215	4,637

తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం



మా వద్దకు వచ్చే తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం. గర్భం దాల్చిన తరువాత మంచి ఆహారం తీసుకోవాలని చెబుతున్నాం. సమాజంలో అమ్మాయిలు.. అబ్బాయిలతో సమానమనే భావన తల్లిదండ్రుల్లో కలగాలి. సాధారణంగానే బాలికల శాతాన్ని పెంచాలి. లింగనిర్ధారణ పరీక్షలపై నియంత్రణ ఉండాలి. చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలి. అమ్మాయిలకు మంచి భవిష్యత్తు ఉంటుంది. వారి కోసం అనేక సంక్షేమ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి.

- డా.సంగీత షా, ప్రసూతి విభాగాధిపతి, మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నాం



సమాజంలో బాలికలు, బాలురు అనే తేడా లేకుండా ఉండటానికి వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఎక్కడ కూడా భ్రూణ హత్యలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తున్నాం. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన తరువాత ఎట్టి పరిస్థితుల్లో వాటి వివరాలు బహిర్గతం చేయరాదు. నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్నాం.

- పద్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, మహబూబ్‌నగర్

అక్షరాలు.. ఆకలి తీర్చే ఔషధాలు



మాట్లాడుతున్న గేయ రచయిత అందెశ్రీ

పాన్‌గల్, న్యూస్‌టుడే : అక్షరాలు ఆకలి తీర్చే ఔషధం కావాలని గేయ రచయిత, లోక కవి అందెశ్రీ అన్నారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఆ పాఠశాల ఉపాధ్యాయుడు, పుస్తక సంపాదకుడు సి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఫ్లయింగ్‌బర్డ్స్' విద్యార్థుల కవితా సంకలనం పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమానికి అందెశ్రీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనిషి ఎదుర్కొనే ఆకలి, ఆశ, కోరికలకు పరిష్కారం అక్షరమే అన్నారు. 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం' అన్న గేయం తెలంగాణ ఉద్యమ సమయంలో, నేడు రాష్ట్ర గేయంగా మారినా దానిని నిలబెట్టింది, గుర్తింపునిచ్చింది, బతికించింది పిల్లలేనని గుర్తు చేశారు. తాను నిరక్షరాస్యుడైనా చందస్సు రాసి, ఎవరైనా ఎలాంటి పరిస్థితుల్లోనైనా ధృడంగా విశ్వసిస్తే ఎంతటి శిఖరాలకైనా చేరుకోవచ్చని తెలిపారు. విద్యార్థి దశలోనే ఇంత గొప్ప కవిత్వం రాసిన బాలలు రాబోయే రోజుల్లో తమ సాహితీ ప్రక్రియ ద్వారా సమాజంలో ఉన్నత మార్పులు తీసుకురావడానికి తమను తాము గొప్పగా మలుచుకోవాలని సూచించారు. చదువు లేని వ్యక్తి ఏదైనా తప్పు చేయాలంటే ఆలోచిస్తాడని, అదే చదువుకున్న వ్యక్తి ఆలోచించకుండా తప్పులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాలాన్ని అవసరాల కోసం వినియోగించుకోవాలని సూచించారు. అంతర్జాలం కంటే మన మేధస్సు ఎంతో గొప్పదని, అంతర్జాలం కారణంగా అన్ని మర్చిపోతున్నామని ఆందోళన చెందారు. కులమతాలకు అతీతంగా పిల్లలకు బోధించాలని ఉపాధ్యాయులను సూచించారు. రాష్ట్ర మంత్రుల కార్యాలయాలను తలదన్నే విధంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. పాఠశాల ఆవరణలో నీటి వసతి లేదని కొందరు విద్యార్థులు కార్యక్రమం దృష్టికి తేగా ఆయన వెంటనే స్పందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు నరేందర్, మంజుల, ప్రజాకవి జనజ్వాల, గాయకుడు సత్తార్, ఎంపీడీవో గోవిందరావు, ఎంపీవో రఘురాములు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5 తరగతులు.. 12 మంది విద్యార్థులు



బుధవారం హాజరైన 8 మంది విద్యార్థులు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : మండలంలోని లక్ష్మీదేవమ్మపల్లి ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో బుధవారం 8 మంది హాజరయ్యారు. ఉదయం 11.30 గంటలకు 'న్యూస్‌టుడే' పాఠశాలను సందర్శించగా రెగ్యులర్ ఉపాధ్యాయుడికి బదులు చాకల్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రమేష్ విధుల్లో ఉన్నారు. వివరాలు ఆరా తీయగా.. రెగ్యులర్ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్ బదిలీ అయ్యారని, ఆయన స్థానంలో కర్ణమయ్యకుంట తండాకు చెందిన ఓ ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై నియమించారని తెలిపారు. బుధవారం ఆయన సెలవులో ఉండటంతో తనను ఒకరోజు కోసం పాఠశాలకు పంపించారని పేర్కొన్నారు. గతంలో 30 మంది వరకు విద్యార్థులుండే ఈ పాఠశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరం కేవలం 12 మందికే పరిమితమయ్యారు. ఈ విషయమై మండల విద్యాధికారి శ్రీనివాసగౌడ్‌ను ప్రశ్నించగా తల్లిదండ్రులు పిల్లలను ఆంగ్ల మాధ్యమం కోసం పట్టణాలకు పంపడం వలన విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందని, వారి సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

'పాలమూరు కరవుకు కాంగ్రెస్ పార్టీయే కారణం'

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : ఉమ్మడి పాలమూరును పడావు పెట్టిందే కాంగ్రెస్ పార్టీనని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పాలమూరులోని ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టి ఆంధ్ర, రాయలసీమ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసిందని పేర్కొన్నారు. పదేళ్లలో కేసీఆర్ తలపెట్టిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులపై వందల కేసులు వేయించి అడ్డుకున్న పాపం ఆ పార్టీదేనన్నారు. కృష్ణా నది నుంచి రోజూ 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు సముద్రం పాలవుతున్నా రిజర్వాయర్లు నింపుకోలేకపోవడం రాష్ట్ర ప్రభుత్వ చేతకాని తనమన్నారు. జూరాలపై భారం పడొద్దనే శ్రీశైలం బ్యాక్ వాటర్ కింద కేసీఆర్ 'పాలమూరు-రంగారెడ్డి' మొదలు పెట్టారని గుర్తు చేశారు. మంత్రుల పర్యటనతో పాలమూరుకు ఒరిగేదేమీ లేదని, ఇక్కడి రైతులకు మేలు చేయాలన్న ప్రణాళిక, చిత్తశుద్ధి లేదని ఎద్దేవా చేశారు. భారాసకు భయపడి మంత్రులు హడావిడిగా ప్రాజెక్టుల పర్యటనలు పెట్టుకున్నారని విమర్శించారు.

విద్యార్థులకు ఆరోగ్య ప్రశస్త

పిల్లల్లో శారీరక, మానసిక లోపాల గుర్తింపునకు ప్రత్యేక యాప్



తుమ్మిళ్ల పాఠశాలలో ట్యాబ్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్: పాఠశాలలకు వస్తున్న విద్యార్థుల్లో చాలా మంది శారీరక, మానసిక వికలత్వంతో పాటు, కొందరు గుర్తించలేని లోపాలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. ఇలాంటి వారికి సంబంధించి ప్రభుత్వం వివరాలు సేకరించనుంది. ఈ మేరకు ఎన్‌సీఈఆర్టీ ప్రత్యేకంగా ప్రశస్త పేరుతో యాప్‌ను రూపొందించింది. ఉపాధ్యాయులే విద్యార్థులను పరిశీలించి వారికి సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంది. ఇలా నమోదు చేసిన వారిలో సమస్య లుంటే పిల్లలకు ఉన్నత స్థాయి వైద్యం అందేలా చర్యలు తీసుకోనున్నారు. ఇందులో భాగంగానే 25, 26, 27 తేదీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులకు ఆర్పీలు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందిన వారంతా వారి పాఠశాలల్లోని పిల్లల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో : అయిదు జిల్లాల పరిధిలో మొత్తం 3,227 ప్రభుత్వ పాఠశాలలుండగా, 1,200కి పైగా ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 5.20 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరందరి వివరాలు ప్రశస్త యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, పేరు, సర్వీసు నంబర్, మెయిల్ ఐడీ, చరవాణి, యూడైస్ కోడ్‌తో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. తరువాత అందులో సూచించిన విధంగా వివరాలు నమోదు చేయాలి.

రెండు భాగాలుగా : ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయ్యాక ఈ కార్యక్రమం అమలు కానుంది. దీనిని రెండు భాగాలుగా విభజించారు. ప్రశస్త యాప్‌లో పొందుపరిచిన విధంగా ఉపాధ్యాయులు కొన్ని ప్రశ్నలను పిల్లలను అడిగి తెలుసుకోవాల్సి ఉంటుంది. మరికొన్ని వారే నిశితంగా పరిశీలించి నమోదు చేయాల్సి ఉంటుంది.

● పార్ట్-1 కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి అక్టోబరు 26 వరకు చేపట్టాలి. ఈ సమయంలో యాప్‌లో ఉన్న 64 రకాల ప్రశ్నలకు సమాధానాలు పొందుపరచాల్సి ఉంటుంది. బోధన సమయంలో ఆ విద్యార్థి సరిగా చూస్తున్నాడా? గమనిస్తున్నాడా? చదువుతున్నా? అవయవలోపం, వినికిడి లోపం, మాటలో తడబాటు, మానసిక వైకల్యం ఇలాంటివి గమనించి నమోదు చేయాలి.

● పార్ట్- 2 కార్యక్రమాన్ని అక్టోబరు 27 నుంచి నవంబరు 14 వరకు చేపట్టాల్సి ఉంటుంది. ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించే ఉపాధ్యాయులు లోపం ఉన్న వారిని పరిశీలిస్తారు. లోపాన్ని గుర్తించి వైద్యులకు సిఫార్సు చేయాల్సి ఉంటుంది.



ప్రశస్త యాప్ ముఖచిత్రం

మెరుగైన వైద్యం అందేలా..

విద్యార్థులకు సంబంధించి శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు, అవయవ లోపం ఉన్న వారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. పేదరికంతో తల్లిదండ్రులు వైద్యం చేయించలేని పరిస్థితులు అయిదు జిల్లాలలోని క్షేత్ర స్థాయిలో నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే నేరుగా విద్యార్థుల సమస్యలను తెలుసుకొని, ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోనుంది.

వంద శాతం నమోదయ్యేలా చూస్తాం



ప్రశస్త యాప్ ద్వారా విద్యార్థుల వివరాలన్నీ వందశాతం నమోదు చేసేలా చూస్తాం. ఇప్పటికే ఈ యాప్‌పై ఉపాధ్యాయులకు శిక్షణలు నిర్వహిస్తున్నాం. శిక్షణ ముగిసిన వెంటనే విద్యార్థులందరినీ సూక్ష్మంగా పరిశీలించి వారి లోపాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలు ఉన్నతాధికారులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటారు.

-హంపయ్య, జిల్లా విద్యాశాఖ సమన్వయ అధికారి, గద్వాల

భార్య వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య



సాయి

కందనూలు, న్యూస్‌టుడే : భార్య వేధింపులు తట్టుకోలేక భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. రెండో ఎస్సై రమాదేవి కథనం ప్రకారం.. పట్టణంలోని నాగనూల్ బీసీ కాలనీకి చెందిన సాయి (21)కి నెల రోజుల క్రితం హైదరాబాద్‌కు చెందిన యువతితో వివాహమైంది. ఆమె మొదటి నుంచి భర్తతో సన్నిహితంగా ఉండకుండా తరుచు వేధించింది. వేధింపులు తట్టుకోలేక మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు మృతదేహాన్ని పట్టణంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. బుధవారం సాయి బావ శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగ్గురిపై పోక్సో కేసు నమోదు

ధరూర్, న్యూస్‌టుడే: కేటిదొడ్డి మండలం ఉమిత్యాల గ్రామానికి చెందిన ముగ్గురు యువకులపై పోక్సో చట్టం కింద బుధవారం కేసు నమోదైంది. డీఎస్పీ సత్యనారాయణ కథనం మేరకు.. ఉమిత్యాల గ్రామానికి చెందిన ఓ బాలిక వారం రోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. బాలిక మృతికి లైంగిక వేధింపులే కారణమే ఆరోపణలు వచ్చాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేసిన పోలీసులు లైంగిక వేధింపుల వల్లనే ఆమె మృతిచెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. దీంతో అదే గ్రామానికి చెందిన జగదీశ్వర్‌రెడ్డి, జయచంద్ర, వీరేశ్‌లపై పోక్సో చట్టంతో పాటు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి వారిని బుధవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

ఆ ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్

కందనూలు, న్యూస్‌టుడే : బిజినేపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి తన స్నేహితురాలితో కలిసి మే 15న నాగర్‌కర్నూల్ పట్టణంలోని నల్లవెల్లి ప్రధాన రహదారి పక్కన కారులో భోజనం చేస్తుండగా పట్టణంలోని ఠాణాలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ట్యాబ్‌లో ఫొటో తీసి బెదిరింపులకు పాల్పడి డబ్బులు వసూలు చేశాడు. అదే ఫొటోను బిజినేపల్లి ఠాణాలో విధులు నిర్వహించిన రాంచందర్‌కు పంపడంతో అతను కూడా బాధితుడిని బెదిరించాడు. ఈ ఫొటో భార్య, భర్తల మధ్య కలహాలకు కారణమైంది. ఈ ఘటనపై ఈనెల 23న ఆరోపణలు రావడంతో పోలీసు ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి మంగళవారం జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌కు పూర్తి నివేదిక అందజేశారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న రాంచందర్, చిన్నను ఎస్పీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ కనకయ్య బుధవారం రాత్రి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో పోలీసు అదృశ్యం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : పాన్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రామకృష్ణ ఆర్థిక ఇబ్బందులతో అదృశ్యమయ్యారని వనపర్తి పట్టణ ఎస్సై జయన్న తెలిపారు. వనపర్తి పీర్లగుట్టలోని పోలీస్‌క్వార్టర్స్‌లో కుటుంబసభ్యులతో నివాసం ఉంటున్నారని, మంగళవారం సాయంత్రం ఎస్కార్ట్ విధులకు వెళుతున్నానని భార్య మంజుతో చెప్పి ఇంటి నుంచి వెళ్లి పోయారు. బుధవారం ఉదయం ఆమె ద్విచక్ర వాహనంపై ఉన్న భర్త బ్యాగును చూశారు. అందులో ఉన్న చరవాణి తీసి మెసేజ్ చదివారు. 'సారీ.. మంజు క్షమించు శ్రీరంగాపూర్‌లో పని చేస్తున్న రాకేశ్ మోసం చేశాడని, జీవితాంతం ఉద్యోగం చేసిన అప్పులు తీరే పరిస్థితి కనిపించడం లేదని, రుణాలతో సుమారు రూ.కోటికి ష్యూరిటీ ఇచ్చానని, ఈఎంఐ కట్టే పరిస్థితిలో లేనని అందకు వెళ్లిపోతున్నాని సమాచారం ఇచ్చాడని' ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కానిస్టేబుల్ అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా బుధవారం తెల్లవారుజామున 3.40 గంటలకు ఆయన హైదరాబాద్ బస్సులో వెళ్లారు. బస్సు చోదకుడిని అడగగా ఎంజీబీఎస్‌లో ఉదయం 6.40 గంటలకు కానిస్టేబుల్ దిగినట్లు తెలిపారని ఎస్సై పేర్కొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00


నైపుణ్యాల ప్రదర్శన



వేలి ముద్రలను తనిఖీ చేసే విధానాన్ని పరిశీలిస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, చిత్రంలో ఎస్పీ డి.జానకి, అదనపు ఎస్పీలు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో 2024 సంవత్సరానికి సంబంధించి శాఖాపరమైన నైపుణ్యాలను బుధవారం ప్రదర్శించారు. దీనికి జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ హాజరై పోలీసు ప్రతిభా పాటవాలను అంచనా వేశారు. మహబూబ్‌నగర్ పోలీస్ విధుల నిర్వహణ కార్యశాలను డీఐజీ ప్రారంభించి మాట్లాడారు. వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నారు. ఫోరెన్సిక్ సైన్స్, నేర పరిశోధన, క్రిమినల్ లా, రాత పరీక్ష, మౌఖిక పరీక్ష, చేతి వేలి ముద్రల సేకరణ, నేరం జరిగిన చోట ఫొటోగ్రఫీ తీసే విధానం, సంఘటన స్థలంలో పోలీసుల నేర శోధనతో పాటు వాహనాల తనిఖీలు, క్షేత్రస్థాయిలో పరిశోధన, గదుల్లో పరిశోధన, కంప్యూటర్‌లో సాంకేతిక పరిజ్ఞానం, పోలీసుల జాగిలాలతో నేరస్థుల గుర్తింపు, నేరం చేసిన తర్వాత నిందితుడు వెళ్లే రహదారి గుర్తింపు, తదితర వాటిపై పోటీలు నిర్వహించారు. ఎస్పీ డి.జానకి, అదనపు ఎస్పీలు రాములు, సురేశ్‌కుమార్, డీఎస్పీ సుదర్శన్, సీఐ రాజేందర్ పాల్గొన్నారు.

కొత్త పద్ధతులతో బోధించండి



మాట్లాడుతున్న పీయూ రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి

పాలమూరు, న్యూస్‌టుడే: మారుతున్న కాలానికి అనుగుణంగా అధ్యాపకులు కూడా తమ బోధన పద్ధతులను మార్చుకోవాలని, కొత్తగా వస్తున్న నూతన పద్ధతులను అందిపుచ్చుకోవాలని పీయూ రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి సూచించారు. బుధవారం పాలమూరు విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు అధ్యాపక బోధన పద్ధతులపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తొలిరోజు గ్రంథాలయ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశానికి రిజిస్ట్రార్ హాజరై మాట్లాడారు. బోధనా రంగంలో నిత్యం అనేక రకాల మార్పులు చోటు చేసుకుంటున్నాయని, వాటిలో అధ్యాపకులు తగిన శిక్షణ పొందాలన్నారు. వృక్షశాస్త్ర ఆచార్యులు డా.సుధాకర్‌రెడ్డి, ఛైర్మన్ డా.చంద్రకిరణ్, పరీక్షల నియంత్రణ అధికారి డా.రాజ్‌కుమార్, కన్వీనర్ జిమ్మి కాటన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్య: మల్దకల్ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రహరీ అసంపూర్తిగా ఉన్నందున మూగజీవాలు ఆవరణలోకి వస్తున్నాయి.
– పరశురాముడు, మల్దకల్

సమాధానం: నిధులు లేక పనులు ఆగాయి. ప్రతిపాదనలు పంపుతాం.
– స్వరూపరాణి, వైద్యాధికారిణి

- న్యూస్‌టుడే, మల్దకల్

తెరపై ఈనాడు

గద్వాల : ఎస్వీసీ సినిమాస్... మత్తు వదలరా-2, సరిపోదా శనివారం, గొర్రె పురాణం, **అయిజ:** భువనేశ్వర్ : 100 కరోడ్స్ మాధవ్ : మత్తు వదలరా - 2
- న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ

జలాశయాల సామర్థ్యం పెంపుతో అదనపు నీరు

మంత్రులకు ఎమ్మెల్యే విజ్ఞప్తి


గట్టు ఎత్తిపోతల పథకం ఫొటో గ్యాలరీని వీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

ధరూరు, గట్టు న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టుకు వరదలు వచ్చిన సమయంలో అదనపు నీటినిల్వ వినియోగంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం జిల్లాలో ప్రాజెక్టుల సందర్శనకు వచ్చిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావుకు హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యే, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత తదితరులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు జలాశయం పనులను పరిశీలించారు.

మరో 10 టీఎంసీలకు: జూరాలకు వరద వచ్చిన సమయంలో 90 రోజుల పాటు అదనంగా నీటివినియోగానికి అవకాశం ఉందని జలాశయాల సామర్థ్యం పెంచితే అదనంగా 10 టీఎంసీల నీటి వినియోగానికి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ర్యాలంపాడు జలాశయం మరమ్మతుల కారణంగా కేవలం రెండు టీఎంసీలకే పరిమితం అయ్యిందని నాలుగు టీఎంసీల నిల్వకు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో జలాశయాల సామర్థ్యం 15 నుంచి 20 టీఎంసీలకు పెంచుకుంటే జూరాల కింద రబీలో నీటికొరత ఏర్పడిన పక్షంలో స్టోరేజీ జలాశయాల నుంచి నీటిని జూరాలకు గ్రావిటీ ద్వారా వదిలి పంటలను కాపాడుకోవచ్చన్నారు. జలాశయాల సామర్థ్యం పెంపునకు అటు కర్ణాటకలో ప్రభుత్వం నిర్ణయం తీసుకొందని దీంతో మనకు వరద నికరజలాలు తగ్గే ప్రమాదం ఉంటుందన్నారు. నీటినిల్వ, అదనపు వినియోగంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి దానికి సంబంధించిన డీపీఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఈఎన్‌సీ అనిల్‌ను ఆదేశించారు. ర్యాలంపాడుకు మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని జలాశయంలో నీటినిల్వ తగ్గగానే డిసెంబరు మాసంలో పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకుంటామని వచ్చే ఖరీఫ్ సీజన్‌కు ర్యాలంపాడులో 4.2 టీఎంసీలు నిల్వచేసేలా చర్యలు తీసుకుంటామని ఈఎన్‌సీ వివరించారు. ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, సాగునీటిశాఖ కార్యదర్శి ప్రశాంత్‌పటేల్, ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్, పార్టీ, నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు అప్రమత్తం: గద్వాలలో గతంలో మంత్రి జూపల్లి పర్యటన సందర్భంగా ఉద్రికత్తలు తలెత్తిన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇటు కృష్ణమోహన్‌రెడ్డి, అటు సరిత అనుచరులు హెలిప్యాడ్ వద్దకు చేరుకోవటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ శ్రీనివాసరావు అక్కడే ఉండి పరిస్థితిని సమీక్షించారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించండి


ధరూరులో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

గద్వాల గ్రామీణం, ధరూరు, గట్టు, అయిజ. న్యూస్‌టుడే: వర్షాల పంటలకు సోకుతున్న తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పాటించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియానాయక్ పేర్కొన్నారు. బుధవారం గద్వాల మండలం గోనుపాడు గ్రామంలో శాస్త్రవేత్తలతో కలిసి తెగుళ్లు సోకిన పత్తి, కంది పంటను ఆయన పరిశీలించారు. ● పాలెం వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం ధరూరు, ర్యాలంపాడు, గట్టు మండలం ఆలూరు, అయిజ శివారు తదితర ప్రాంతాల్లో పత్తి, వరి, ఆముదం పంటలను పరిశీలించారు. వర్షాల కారణంగా పంటలకు ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు పిచికారీ చేయాల్సిన మందులు ఇతర సస్య రక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. నళిని, శంకర్, సైదయ్య, ఈశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, పెద్దన్న, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియానాయక్, తదితరులు పాల్గొన్నారు.

పుర పరిధిలో స్వచ్ఛతా హీ సేవా


సంగాల చెరువు వద్ద మొక్కలు నాటుతున్న పుర కమిషనర్ దశరథ్

గద్వాల కలెక్టరేట్, శాంతినగర్, న్యూస్‌టుడే: గద్వాల పుర పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ఐడీవోసీ ఎదుట గద్వాల - కర్నూల్ రోడ్డు డివైడర్‌లో ఉన్న కోనో కార్పస్ మొక్కలను తొలగించారు. దౌదర్‌పల్లిలోని పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు పరిశుభ్రత గురించి కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. పట్టణ శివారులోని సంగాల చెరువు కట్టపై మొక్కలు నాటారు. పుర కమిషనర్ దశరథ్, సిబ్బంది, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● వడ్డేపల్లిలోని మాధవస్వామి గుట్టపైన మొక్కలు నాటారు. పురసిబ్బంది పాల్గొన్నారు.

గాన గంధర్వుడికి ఘన నివాళి

మల్దకల్, న్యూస్‌టుడే: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలుగు వారి గుండెల్లో నిలిచిన గాన గంధర్వుడని శ్రీచెన్నకేశవ రంగస్థల నాట్యకళామండలి అధ్యక్షుడు ఎన్.ఆంజనేయులు పేర్కొన్నారు. ఎస్పీ వర్ధంతిని బుధవారం మల్దకల్ మండలం ఎల్కూరులో కళాకారుల బృందం ఘనంగా నిర్వహించింది. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

బీచుపల్లిలో సీబీఐ మాజీ జేడీ పూజలు


బీచుపల్లిలో ప్రత్యేక పూజలలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

ఇటిక్యాల, న్యూస్‌టుడే: బీచుపల్లిలో బుధవారం సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనారోగ్యంతో మృతిచెందిన సోదరి కనకదుర్గ అస్థికలను సీబీఐ మాజీ జేడీ కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. తొలుత ఘాట్ పురోహితుడు అనిల్‌శర్మ శాస్త్రోక్తంగా మాజీ జేడీతో పూజలు చేయించారు.

అధికారులు, ఉపాధ్యాయుల పొలంబాట


పత్తిలో పని చేస్తున్న విద్యార్థినితో మాట్లాడుతున్న ప్రియాంక

గట్టు, న్యూస్‌టుడే: పలు పాఠశాలల్లో ఇటీవల డ్రాపౌట్లు పెరుగుతుండటంపై కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు, ఉపాధ్యాయులు పొలాల బాట పడుతున్నారు. బుధవారం ఆరగిద్ద గ్రామంలో మండల ప్రత్యేకాధికారిణి ప్రియాంక, ఎంఈవో నల్లారెడ్డితో కలిసి పత్తి పొలాల్లో పనులు చేసుకుంటున్న విద్యార్థులను గమనించారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను తిరిగి బడులకు వచ్చేలా ఏర్పాటు చేశారు. మాచర్లలోనూ అధికారులు, ఉపాధ్యాయులు పత్తిపొలాల వద్దకు చేరుకుని పలువురిని బడిబాట పట్టించారు. హెచ్ఎం జహీర్‌బేగ్, నీతిఆయోగ్ కోఆర్డినేటర్ అఫ్జల్, డీసీపీవో నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ పత్రాల అందజేత


ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ఉండవల్లి, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. బుధవారం పుల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యే విజయుడు గ్రామస్థులకు గ్యాస్ సిలిండర్‌కు సంబంధించిన రాయితీ ధ్రువపత్రాలను అందజేశారు. పీఏసీఎస్ ఛైర్మన్ గజేందర్‌రెడ్డి, రఘురెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి సీఐపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: తనపై అకారణంగా దాడికి పాల్పడిన గద్వాల ఇన్‌ఛార్జి సీఐ నాగేశ్వర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు మహేశ్ బుధవారం ఎస్పీ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. గద్వాలలోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థి మృతిచెందిన విషయం తెలుసుకుని పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న ఆ చిన్నారి కుటుంబ సభ్యులతో తెల్లవారు జామున 1.30 గంటల ప్రాంతంలో మాట్లాడే ప్రయత్నం చేస్తుండగా తనపై దాడికి దిగారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తాను విద్యార్థి సంఘం నేతను అని చెబుతున్నా వినకుండా దురుసుగా ప్రవర్తించాడని చెప్పారు. ఈ విషయమై గద్వాల ఇన్‌ఛార్జి సీఐ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఎవరిపై దాడికి పాల్పడలేదన్నారు. పాఠశాల ముందు ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా కొందరిని పక్కకు నెట్టామని, ఆ సమయంలో తమ సిబ్బంది కూడా కొందరు కిందపడ్డారని తెలిపారు. తనపై సామాజిక మాధ్యమంలో వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు.

హామీలు నెరవేర్చాలని డిమాండు


జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి తదితరులు

రాజోలి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు తప్పనిసరిగా నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. బుధవారం రాజోలిలో పార్టీ రెండో మహాసభ నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అర్హులైన రైతులందరి రుణాలు మాఫీ చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు అందించాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు లక్ష్మన్న, బొజ్జన్న, కృష్ణ తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడపడితే అక్కడ చెత్త



వడ్డేపల్లి పురపాలికలో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోతోంది. కొన్ని వీధుల్లో సేకరించిన దానిని ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారని ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. కొయిలదిన్నెకు వెళ్లే రహదారి పక్కన ఇదిగో ఇలా చెత్త కనిపిస్తోంది. దీని వల్ల అటుగా వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డులో మాత్రమే చెత్త వేయిస్తామని, ఎవరైనా రోడ్లపక్కన వేస్తే చర్యలు తీసుకుంటామని దీనిపైన పుర కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు.
– న్యూస్‌టుడే, శాంతినగర్

రోడ్డుపైకి ముళ్లకంప



అయిజ, సింధనూరు మార్గంలో రహదారిపై మలుపుల వద్ద పెరిగిన ముళ్లకంప ప్రమాదకరంగా తయారైంది. భూంపూర్ సమీపంలోని మూల మలుపు వద్ద ఉన్న ఏపుగా పెరిగిన కంప కనీసం ఎదురుగా వస్తున్న వాహనాన్ని సైతం గుర్తించలేని విధంగా రోడ్డుమీదకు చేరుకుంది. దీంతో ఈ ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకోవడం పరిపాటిగా మారింది. ఇదే పరిస్థితి ఈ మార్గంలో అయిదు చోట్ల ఉంది. ముళ్లకంప తొలగించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. పరిశీలించిన ప్రాధాన్యతాక్రమంలో కంపను తొలగిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ మహేశ్ వివరించారు.
-న్యూస్‌టుడే, అయిజ

భక్తులకు వసతులు కల్పించండి


మంత్రి సురేఖకు ఆహ్వానం, ప్రసాదం అందజేస్తున్న ఈవో, అర్చకులు

అలంపూర్ : అలంపూర్ ఆలయాల్లో వచ్చే నెల 3వ తేదీ నుంచి 12 తేదీ వరకు బాల బ్రహ్మేశ్వర స్వామి, జోగులాంబ ఆలయాల్లో నిర్వహించే దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు హాజరుకావాలని బుధవారం హైదరాబాద్‌లో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఈవో పురేందర్, ఆలయ అర్చకులు ఆనంద్‌శర్మ ఆహ్వాన పత్రికను అందజేశారు. అమ్మ వారి శేష వస్త్రాలు, చీర, ప్రసాదాలను అందజేశారు. ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని, భక్తులకు అన్ని వసతులు కల్పించాలని మంత్రి సూచించారు.

28న సర్వసభ్య సమావేశం

మానవపాడు : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఈ నెల 28వ తేదీన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, ఇన్‌ఛార్జీ కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు తెలిపారు. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

శాంతినగర్‌లో రేషన్ బియ్యం పట్టివేత

శాంతినగర్, న్యూస్‌టుడే : శాంతినగర్‌లోని కొయిలదిన్నె రోడ్డులో ఉన్న భాస్కర్ పిండిగిర్నీలో నిల్వ చేసిన 25 బ్యాగుల రేషన్‌బియ్యం, 40 బ్యాగుల నూకలు పట్టుకున్నట్లు శాంతినగర్ ఎస్సై సంతోష్ తెలిపారు. భాస్కర్‌పైన కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

భారాస నేతల అరెస్టు


భారాస నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ధరూరు, గట్టు, న్యూస్‌టుడే: రైతులకు రుణమాఫీ విషయంలో సంపూర్ణ న్యాయం జరగలేదని రెండు లక్షల పైన ఉన్నవారికి తక్షణం మాఫీ చేయాలని కోరుతూ మంత్రులకు వినతిపత్రం ఇస్తామని భారాస నేతలు నిర్ణయించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు బుధవారం ఉదయం నుంచి భారాస కార్యకర్తలు నేతలను ఎక్కడికక్కడ అరెస్టులు చేసి పోలీసు ఠాణాలకు తరలించారు. మంత్రుల పర్యటన ముగిసిన తర్వాత వారి వదిలిపెట్టారు. అరెస్టులు అప్రజాస్వామిక చర్య అని పార్టీనేతలు కుర్వ విజయకుమార్, బాసు హనుమంతు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కుర్వపల్లయ్య, వెంకటేశ్‌నాయుడు తదితరులు ఆరోపించారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి

అలంపూర్ : అలంపూర్ పట్టణ సంత మార్కెట్ కాలనీ దళితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని బుధవారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజు, రేపల్లె దేవదాసు, ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమదాసు ఆధ్వర్యంలో తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. అంతకు మందు పట్టణంలో ర్యాలీగా వచ్చి కార్యాలయం ముందు బైటాయించి ధర్నా చేశారు.

చేనేతపై కనికరం ఏది సారూ?

ఏడాదిన్నర గడిచినా అమలుకాని పథకం


క్లస్టర్ కోసం మగ్గాలు సర్వే చేస్తున్న సీడీఈ(పాత)

రాజోలి, న్యూస్‌టుడే: చేనేత కార్మికులకు నైపుణ్య శిక్షణలు ఇచ్చేందుకు వీలుగా రాజోలికి మంజూరైన చేనేత క్లస్టర్ల పథకం అమలుపై అధికారుల్లో కనికరం కలగడం లేదు. 2023 ఫిబ్రవరిలో కేంద్ర, టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ వారు జాతీయ చేనేత అభివృద్ధి పథకం(ఎన్‌హెచ్‌డీపీ- నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగాం) ద్వారా జిల్లాలోనే అత్యధిక చేనేత కార్మికులున్న రాజోలి గ్రామానికి రెండు సీడీపీ(చేనేత సమూహాల అభివృద్ధి - చేనేత క్లస్టర్) లను మంజూరు చేసింది. అయితే ఏడాదిన్నర గడిచిపోయినా పథకాన్ని ప్రారంభించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు హడావుడిగా మగ్గాల సర్వేతో కాలయాపన చేసి, తరువాత మిన్నకుండిపోతున్నారు. ఫలితంగా చేనేత కార్మికులు వారు చేసే నేత పనిలో నైపుణ్యత పొందేందుకు, అధునాతన పరికరాల గురించి తెలుసుకునేందుకు అవకాశం లేకుండాపోతోంది.

మంజూరు ఇలా..: రాజోలిలో మొత్తం 750కి పైగా మగ్గాలుండగా, మొదటి విడతగా 400 మంది కార్మికుల కోసం రూ.1.30 కోట్ల పథకం మంజూరైంది. తరువాత కొంత కాలానికి రాజోలి, అలంపూర్‌లకు కలిపి మరో 400 మందికి లబ్ధి చేకూరేలా క్లస్టర్ మంజూరైంది. ఈ మేరకు సీడీఈ(క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్)ల నియామకం కూడా జరిగిపోయింది. ఈ పథకంలో భాగంగా కార్మికులకు అధునాతన యంత్రాలను, డిజైన్లను, రంగుల అద్దకం ఎలా ఉపయోగించాలనే దానిపై శిక్షణ ఇస్తారు. అలాగే వారి మగ్గాలకు అవసరమైన మోటార్ జాకార్డులు, మగ్గాలు, లిఫ్టింగ్ యంత్రాలను 90 శాతం రాయితీతో అందించాల్సి ఉంది. అయినా ఈ పథకం అమలుకు జిల్లా అధికారులు చొరవ చూపడం లేదు. ఫలితంగా కార్మికులు మూసపద్ధతిలో మగ్గాలు నేస్తూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారుల సైతం పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందనే వాదన నేతన్నల్లో వ్యక్తమవుతోంది.

ప్రారంభించేలా చర్యలు: ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణమాఫీ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. తరువాత త్రిఫ్ట్ ఫండ్ నిధుల వివరాలు పరిశీలించి, కార్మికులకు అందించే పనులు చేయాల్సి ఉంది. ఇవి పూర్తయిన తరువాత వీలైనంత తొందరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. కార్యాలయంలో ఇద్దరు ఏడీవోలు ఉండటం వల్ల జాప్యం జరుగుతోంది.
–గోవిందయ్య, చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు, జోగులాంబ గద్వాల

కార్యకర్తలతోనే పార్టీ బలోపేతం


మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

మల్దకల్, న్యూస్‌టుడే: కార్యకర్తలతోనే పార్టీ బలోపేతమవుతుందని బీఎస్పీ పార్టీ అధ్యక్షుడు ఆకేపోగు రాంబాబు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారి ఎస్.రాజు పిలుపునిచ్చారు. బుధవారం మల్దకల్‌లో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు గోవిందు ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఉపాధ్యక్షుడు మణికుమార్, కార్యదర్శి వెంకటేశ్ నాయక్, రాజు, నరేష్‌కుమార్, రాజేశ్, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

గద్వాల అర్బన్ : గద్వాలలోని వీరభద్ర స్వామి ఆలయంలో చోరీకి పాల్పడిన కేసులో బుధవారం గద్వాలకు చెందిన అమరేశ్‌ను అరెస్టు చేసినట్లు అరెస్ట్ చేసినట్టు గద్వాల పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున ఆలయంలోకి ప్రవేశించి హుండీని పగులగొట్టి సుమారు రూ.2 వేల నగదు ఎత్తుకెళ్లాడని, సీసీ కెమెరా ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకుని గద్వాల కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్‌కు ఆదేశించిందన్నారు.

వాగులో రహదారి నిర్మాణం


వాగులో రోడ్డుకు మట్టివేస్తున్న ప్రొక్లెయిన్

అయిజ, న్యూస్‌టుడే: దేవబండ వాగులో ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కొట్టుకుపోవడంతో బుధవారం గ్రామస్థులు మూకుమ్మడిగా రహదారికి మట్టివేసి తిరిగి నిర్మించుకున్నారు. ఉదయం విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు, గ్రామస్థులు అయిజకు వెళ్లేందుకు ఇబ్బందిపడ్డారు. దీంతో గ్రామస్థులు ముందుకొచ్చి ప్రొక్లెయిన్‌తో వాగులో మట్టివేసి రోడ్డును నిర్మించుకున్నారు.

ట్యాంకుల శుభ్రత తప్పనిసరి

గద్వాల గ్రామీణం : ప్రతినెల 1వ, 11వ, 21వ తేదీల్లో అంటే ప్రతి పదిరోజులకోసారి తాగునీటి నీళ్ల ట్యాంకులు శుభ్రం చేయాలని మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం గద్వాలలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులకు ఏర్పాటుచేసిన శిక్షణ తరగతుల్లో మాట్లాడారు.


మానవపాడు-అమరవాయి గ్రామాల మధ్య వాగు దాటుతున్న ఆటో


మానవపాడు-గోకులపాడు గ్రామాల మధ్య వంతెనపై ప్రవాహం


ఇటిక్యాలలో బ్రిడ్జిపై వరద ఉద్ధృతి

వంతెనలెక్కిన వాన నీళ్లు

రాకపోకలకు తప్పని ఇబ్బందులు


సాతర్ల వాగు వద్ద తాత్కాలిక రహదారిపై..


జూలేకల్‌లో కూలిన ఇల్లు


మానవపాడు, ఇటిక్యాల, అయిజ, మల్దకల్, వడ్డేపల్లి, న్యూస్‌టుడే: ఎగువన కురిసిన వర్షాల కారణంగా మానవపాడు-అమరవాయి, మానవపాడు-గోకులపాడు గ్రామాల మధ్యన ఉన్న వంతెనలపై బుధవారం వర్షపునీళ్లు ఎక్కిపారాయి. దీంతో అమరవాయి, కలుకుంట్ల, పెద్దఆముదాలపాడు, నారాయణపురం, చంద్రశేఖర్‌నగర్, కొర్విపాడు, మద్దూరు గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ● ఇటిక్యాల, సాతర్ల, షేక్‌పల్లి, గార్లపాడు, వల్లూరు వాగులు ఉద్ధృతంగా ప్రవహించాయి. దీంతో షేక్‌పల్లి, సాసనూలు, దువాస్‌పల్లితో పాటు ఇటిక్యాల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. 11 గంటల తర్వాత వరద తగ్గుముఖం పట్టడంతో పాఠశాలలకు హాజరయ్యారు.


రహదారులు బురదమయం: అయిజ పట్టణంలో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు బురదమయంగా తయారయ్యాయి. పాతబస్టాండు, అంబేడ్కర్ చౌక్, తెలంగాణ చౌరస్తా, పెట్రోల్‌బంక్ చౌరస్తా, తూంకుంట రహదారి, ఎక్లాస్‌పూర్, పాత, కొత్త ఎస్సీ కాలనీలు, కొత్తపేట, బూరందొడ్డి కాలనీ, పద్మావతికాలనీ, రాఘవేంద్ర కాలనీ, దుర్గానగర్ తదితర కాలనీల్లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ● మల్దకల్ మండలం అమరవాయిలోని ఎస్సీ కమ్యూనిటీ హాలు పక్కన ఇళ్లమధ్యన వర్షపు నీరు నిలిచిపోవడంతో బుధవారం ఇళ్లలోకి నీరు చేరింది. ఉదయం నుంచి కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నా అధికారులెవరూ పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాన్ని సందర్శించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఆంజనేయరెడ్డి తెలిపారు. ● వడ్డేపల్లి మండలంలోని జూలేకల్‌లో కుర్వ రంగన్న ఇల్లు కూలిపోయింది. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని రంగన్న, కుటుంబ సభ్యులు కోరారు. పరిశీలించి చర్యలు చేపడతామని తహసీల్దార్ ప్రభాకర్ తెలిపారు.


బురదమయంగా అయిజ తెలంగాణ చౌరస్తా


మల్దకల్: అమరవాయిలో ఇళ్లమధ్య నిలిచిన నీరు

దీన్‌దయాళ్ సేవలు చిరస్మరణీయం




అయిజ: దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద భాజపా నాయకులు.. వడ్డేపల్లి: నివాళులర్పిస్తున్న గ్రామస్థులు

అయిజ, వడ్డేపల్లి : భారతదేశానికి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అందించిన సేవలు చిరస్మరణీయమని భాజపా జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన జయంతి వేడుకలను పురస్కరించుకొని అయిజ పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రదీప్ కుమార్, అశోక్, భగత్‌రెడ్డి, భీమ్‌సేన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ● వడ్డేపల్లి మండలం జూలేకలలో బుధవారం బీజేవైఎం నాయకులు పండిత్ దీనదయాళ్ జయంతిని నిర్వహించారు. పంచాయతీ సమీపంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. గోపాల్, శేఖర్, ఆంజనేయులు, రవి పాల్గొన్నారు.

బ్యాగుల తయారీ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

రాజోలి, న్యూస్‌టుడే: జూట్ బ్యాగుల తయారీలో శిక్షణ పొందిన మహిళల్లో ఆసక్తి ఉన్న వారి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ ఏపీడీ నర్సింహులు అన్నారు. ఆయన బుధవారం రాజోలిలో నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి, మొదటి, రెండో బ్యాచ్ మహిళలతో సమావేశం నిర్వహించారు. శిక్షణ ఏ విధంగా తీసుకున్నారు. ఏవి కుట్టడానికి నేర్చుకున్నారని అడిగి తెలుసుకున్నారు. శిక్షణ తీసుకున్న తమకు ఉపాధి కల్పించాలని, రాయితీపై మిషన్లు అందించాలని మహిళలు కోరారు.